సంబురంగా రాష్ట్ర పండుగ

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, వివిధ పార్టీ ఆఫీసుల వద్ద నాయకులు జాతీయజెండా ఎగురవేశారు. హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్–మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2కె రన్ జరిగింది. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో కార్మికులకు ఏకరూప దుస్తులను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ హాజరై పంపిణీ చేశారు. మున్సిపల్ పాత ఆఫీస్ నుంచి మెప్మా, పారిశుధ్య కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈవో సుధాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించినవారి సేవలను స్మరించుకున్నారు. అమరులకు నివాళి అర్పించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో అదే స్ఫూర్తితో అభివృద్ధి జరగాలని పలువురు కోరారు.


జమ్మికుంటలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, కార్మికులు


చొప్పదండి: జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న వొడితల ప్రణవ్, నాయకులు


ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఆవరణలో వేడుకలు


గంగాధర: ఆవిర్భావ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద


మానకొండూర్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు


గన్నేరువరంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో


శంకరపట్నం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో


మానకొండూర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో...


గన్నేరువరంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు


గంగాధర పోలీస్ స్టేషన్ ఆవరణలో


చిగురుమామిడి: జెండా ఎగురవేస్తున్న ఎంపీడీవో మధుసూదన్

మానకొండూరు క్రికెట్ టోర్నీలో ప్రెస్‌టీం విజయం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానకొండూరు నియోజకవర్గ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తుపల్లి మల్లేశం సమక్షంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ టాస్ వేసి ప్రెస్ వర్సెస్ పొలిటికల్ టీం మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ పోటీలో ప్రెస్ టీం 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ప్రెస్‌టీం కెప్టెన్ రాకేశ్ ఆల్ రౌండర్ ప్రదర్శన చూపడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. టోర్నమెంట్‌లో మానకొండూరు నియోజకవర్గం నుంచి మొత్తం 32 జట్లు పాల్గొంటున్నాయి. ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యే జన్మదినోత్సవం సందర్భంగా టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ, క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని సూచించారు.


ప్రెస్‌టీం కెప్టెన్ రాకేశ్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మంత్రితో భేటీ

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. సోమవారం రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా జిల్లాకు రాగా.. సంఘం నేతలతో మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. డీఏలతోపాటు పీఆర్సీ, పెన్షనర్ల సమస్యలను ప్రస్తావించగా.. ఉద్యోగులకు దన్నుగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం.


మంత్రి శ్రీధర్‌బాబుతో శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

రైతులకు శిక్షణ


మాట్లాడుతున్న ఏవో కిరణ్మయి

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట, గుండ్లపల్లి రైతువేదికల్లో కృషి విజ్ఞాన్ జమ్మికుంట, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పంటలకు సాగు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యల తెలుసుకున్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం12వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ వరి పరిశోధన సంస్థ నుంచి డాక్టర్ సునీత, శివకుమార్, శాస్త్రవేత్తలు విజయ్, ప్రశాంతి, ఏవో కిరణ్మయి, ఏఈవోలు అనూష, కీర్తి, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెండో విడత డిగ్రీ అడ్మిషన్లు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి రెండో విడత డిగ్రీ అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ప్రిన్సిపల్ డా.బి రమేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. దోస్త్‌లో జూన్ 08 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వెబ్ ఆప్షన్లు ఇవ్వాలన్నారు. బీఎస్సీ, బీజెడ్సీ, క్రాప్ ప్రొడక్షన్, డైరీ సైన్స్, ఎంపీసీఎస్, బీఏ హెచ్ఈసీ, కంప్యూటర్ సైన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్, బీకాం, కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, అడ్మిషన్లకు సమాచారం కోసం దోస్త్ కోఆర్డినేటర్ ఎల్.రవీందర్ సెల్ నెంబర్ 9491114511, 9849689956 సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐటీఐ కళాశాలలో..

జమ్మికుంట: పట్టణంలోని జీఎస్ఆర్ ప్రైవేటు ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి మొదటి దఫా అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వీర్రాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా 21వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని సమాచారం కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి

కరీంనగర్: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి వోల్లాల కృష్ణహరి, పోపా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్, మాజీ కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, లెక్కల వేణు, జిల్లా నాయకులు వోడ్నాల రవీందర్, స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, జక్కని ప్రభాకర్, అడిచర్ల రాజు, దీకొండ లక్ష్మీనారాయణ, చిలక నర్సప్ప, ఎన్నం మునీందర్, పొన్నాల రవీందర్, శ్రీనివాస్, వాసు, రాజశేఖర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

రోడ్డు ఆక్రమణ.. రైతుల ఆవేదన

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామం నుంచి పెర్కపల్లి, గొల్లగూడెం, శివరాంపల్లి, ఆకునూర్, ఘనపూర్‌కు వెళ్లే మట్టిరోడ్డు ఆక్రమణకు గురైందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ రైతు వర్షపునీరు వెళ్లే కందకాన్ని పూడ్చి 33 ఫీట్ల వెడల్పు గల రోడ్డు 15 ఫీట్లకు జేసీబీ సహాయంతో కుదించాడని పెర్కపల్లి, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు, వ్యవసాయబావుల వద్దకు వెళ్లే రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం మాజీ ఎంపీటీసీ కత్తుల రమేశ్, మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల శారద–సదానందం, రైతులు రాజిరెడ్డి, అశోక్, భిక్షపతి, తిరుమల్‌తో పాటు పలువురు రైతులు ఆక్రమణకు గురైన రోడ్డును పరిశీలించారు. రైతుపై కరీంనగర్ ఆర్డీఓ, చిగురుమామిడి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆక్రమణకు పాల్పడిన రైతు తన వ్యవసాయభూమి నుంచే నక్షప్రకారం రహదారి ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కాగా ఈ విషయంపై సదరు రైతును వివరణ కోరగా నక్షా ప్రకారం రోడ్డు ఎంత విస్తీర్ణం ఉంటే అంత వదిలిపెడతానని తెలిపారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రామడుగు: మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు రవీందర్, నాయకులు జిట్టవేని అంజిబాబు, రామ్, లక్ష్మణ్, సత్యనారాయణచారి, రాజేంద్రాచారి, కలిగేటి ఏల్లయ్య పాల్గొన్నారు.




కమిషనరేట్‌లో జెండా వందనం చేస్తున్న కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం క్వార్టర్స్ గార్డ్స్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగరేశారు. కమిషనరేట్ పరిపాలన కార్యాలయం(సీపీవో) వద్ద ఏసీపీ(సీసీఆర్బీ) జి.విజయ్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఎగరేశారు. కరీంనగర్ జిల్లా జైలులో సూపరింటెండెంట్ విజయ్‌దేని జాతీయ పతకాన్ని ఎగరేశారు. మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా జైలులో జాతీయ పతాకం ఎగరేసిన సూపరింటెండెంట్ విజయ్‌దేని

బాధ్యతలు స్వీకరణ


ఆర్ఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శంకరయ్య

కరీంనగర్: కరీంనగర్ రీజియన్ నూతన అకౌంట్స్ ఆఫీసర్‌గా అలువాల శంకరయ్య సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆదిలాబాద్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేసి బదిలీపై కరీంనగర్ వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎం.డి.జియావొద్దీన్ మే 31న విరమణ పొందారు. శంకరయ్యకు అకౌంట్స్ ఆఫీస్ కార్యాలయ సూపర్‌వైజర్ కిరణ్, మొగిలి, ఆఫీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. శంకరయ్య రీజనల్ మేనేజర్ బి.రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రీజనల్ మేనేజర్ అకౌంట్స్ ఆఫీసర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి, పి.మల్లేశంను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపకార్మిక కమిషనర్‌గా ప్రసాద్


ఉపకార్మిక కమిషనర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కరీంనగర్: ఉప కార్మిక సహాయ శాఖ కార్యాలయంలో ఉప కార్మిక కమిషనర్‌గా కోల ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో సహాయ కార్మిక కమిషనర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై కరీంనగర్ శాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. ప్రసాద్‌ను సహాయ కార్మిక కమిషనర్ ఎస్.వెంకటరమణ, సహాయ కార్మిక అధికారులు రఫీ మహమ్మద్, చక్రధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు బి.మనోజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు మధుకర్‌రావు, శ్రీకాంత్, దివ్య, వివిధ కార్మిక సంఘాల నాయకులు సన్మానించి స్వాగతం పలికారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లందకుంట: చికిత్స పొందుదూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కొత్తూరి సమ్మయ్య(60)కు ఇంటిపక్కన ఉన్న గంగారపు ప్రమీల కుటుంబంతో ప్రహరీ విషయంపై ఆదివారం మధ్యాహ్నం గొడవ జరిగింది. ప్రమీలతో పాటు ఆమె కుటుంబ సభ్యులు సమ్మయ్యను అసభ్య పదజాలంతో దూషించారు. అవమానకరంగా భావించిన సమ్మయ్య వ్యవసాయక్షేత్రం వద్ద పురుగుమందు తాగి కొడుక్కి ఫోన్ చేశాడు. చికిత్స నిమిత్తం జమ్మికుంట, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదుతో ప్రమీల, తిరుపతమ్మ, స్వర్ణలతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి గ్రామ శివారులో సోమవారం బైక్‌ను ఇసుకలారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గాజుల రాజు(30), పోతరవేని శ్రీను(25) బైక్‌పై మొలంగూర్ నుంచి స్వగ్రామం వెళ్తుండగా ఇసుక లారీ ఢీకొట్టింది. యువకులకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లిలో బైక్ చోరీ అయినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు. సూర్యపేట జిల్లాకు చెందిన శివరాత్రి గోపి గుండ్లపల్లిలో అద్దెకుంటూ, హన్మాజిపల్లె క్వారీలో డ్రైవర్ పని చేస్తున్నాడు. మే 27న పనులు ముగించుకొని సాయంత్రం ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేశాడు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికాడు. సోమవారం గోపి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

సంక్షిప్త వార్తలు

● వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

హుజూరాబాద్: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో శ్రీభవానీరామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభ శిఖరయంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రణవ్‌హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

● ఉర్సు ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ హజ్రత్ సయ్యద్ ఇంకుషావలీ రహమతుల్లా అలై దర్గాలో 7న ప్రారంభమయ్యే ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను హుజూరాబాద్ ఏసీపీ మాధవి, టౌన్ సీఐ రామకృష్ణ సోమవారం పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కరీం, కార్యనిర్వహణ అధ్యక్షుడు తౌఫిక్ హుస్సేన్, కార్యదర్శి జమాల్ అశ్రఫ్, సయుక్త కార్యదర్శి నయిమోద్దీన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నిత్య అన్నప్రసాద వితరణలో ఏసీపీ, టౌన్ సీఐ పాల్గొన్నారు.

● ఆలయ చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి

శంకరపట్నం: మండంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి సోమవారం నియామకమయ్యారు. ధర్మకర్తలుగా రామగిరి తిరుమల, ఎడ్ల తిరుపతి, కె. రత్నం, ఎం.లక్ష్మణ్‌రావు, ఎం.రవీందర్, టీ.తిరుపతి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ పూజారి శేషం మురళీధరాచార్యులను నియమిస్తూ దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను చైర్మన్, ధర్మకర్తలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బస్వయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ చైర్మన్ మల్లారెడ్డి, సంతోష్,అజయ్, షారూఖ్ తదితరులున్నారు.

● ఉచిత వైద్య శిబిరం

వీణవంక: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం కొండపాక లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... మెడికవర్ ఆసుపత్రిలో అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. శిబిరంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజయ్య, సంఘం డైరెక్టర్లు, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, సంజీవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యం

వీణవంక: కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని పార్టీ మండలఅధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి అన్నారు. బేతిగల్‌లోఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమిపూజ చేశారు. విడతల వారీగా అర్హులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. బొంతుపల్లి లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పార్టీ సీనియర్ నాయకుడు చదువు జైపాల్‌రెడ్డి పంపిణీ చేశారు.